# నిర్నిద్రాగానం

హెచ్.బి కాలనీలో ఇరవయ్యో నంబరు సిటీబస్సెక్కాను.

బస్సు బయలుదేరింది.

ఈనాడు దగ్గర ఆగేసరికి జనం బాగా ఎక్కేశారు.

సీట్లన్నీ ఫిలప్ అయిపోయాయి.

అప్పుడే ఉలెన్ సూటులో వున్న ఓ వ్యక్తి బస్సెక్కాడు. కళ్ళకు రిమ్‌లెస్ అద్దాలున్నాయి. కాళ్ళకు ఖరీదైన షూస్, చేతిలో ఫిల్టర్ సిగరెట్ కులాసాగా కాలుతోంది.

సూటువాలా నేరుగా సీట్లో కూర్చున్న నా దగ్గరకు వచ్చి నిలబడ్డాడు

నన్ను చూసి పలకరింపుగా నవ్వాడు.

నేను పట్టించుకోనట్టు కిటికీలోంచి బయటికి తల తిప్పాను

బస్సు స్టాపుల్లో ఆగుతూ ముందుకుపోతోంది.

కండక్టరు అభిమన్యుడిలా పాసింజర్ల గుంపుని ఛేదించుకుంటూ టిక్కెట్లు కట్‌చేస్తున్నాడు. గేటుదగ్గర గుంపుగా వున్నవాళ్ళని లోపలికి రమ్మని అరుస్తున్నాడు. ఎంతకూ కదలకుండా గేటుదగ్గర నిలబడి వున్నవాళ్ళని "బాబూ ! బస్సులో కండక్టర్‌ని సమాధి చేసేటంత చోటుంది. లోపలికి వచ్చి సర్దుకోండి" అంటూ హుషారిస్తున్నాడు.

జగదాంబ జంక్షన్ స్టాపులో బస్సాగింది.

ఆ సూటువాలా కండక్టర్‌ని సమీపించాడు.

"నా చిల్లరియ్యి కండక్టర్ !" అని అడిగాడు.

కండక్టర్ తెల్లబోయాడు.

"నేను మీకు చిల్లరివ్వడమేమిటి ? మీరు టిక్కెట్టుకి అర్ధరూపాయేగా ఇచ్చారు !" అన్నాడు ఆశ్చర్యంగా.

సూటువాలా కండక్టర్‌ని కోపంగా చూశాడు.

"ఏమిటయ్యా ! ఎందుకా అబద్దాలు ? నేను నీకు పదిరూపాయల నోటిచ్చాను. నాకు అర్ధ రూపాయి టిక్కెట్ కట్‌చేసి, మిగతా చిల్లర తరవాతిస్తానని అన్నావు. ఇప్పుడు చిల్లరడిగితే ఇలా మాట మారుస్తావా ?" అంటూ గట్టిగా అరిచాడు.

సూటువాలా అలా అనేసరికి కండక్టర్‌కే కోపం వచ్చింది.

"నేనేమీ అబద్ధమాడటంలేదు. నువ్వే అబద్ధం చెబుతున్నావు. ఒంటికి ఖరీదైన బట్టలు వేసుకోగానే సరిపోదు.... మనసుకి కూడ నిజాయితీ అయిన దుస్తులు వేసుకో !" స్వరం పెంచి అన్నాడు కండక్టరు.



ఆ మాటలకు సూటువాలా ముక్కుపుటాలు కోపంతో అదిరాయి....

దవడ కండరాలు బిగుసుకున్నాయి....

పళ్ళు పటపటమని కొరికాడు.

ఆవేశంగా చేతి పిడికిళ్ళు బిగించి నిలువునా వూగిపోయాడు....

అప్పటికే పాసింజర్లంతా వాళ్ళిద్దర్నీ కుతూహలంగా చూస్తున్నారు !

నేనుకూడ కళ్ళప్పగించి వాళ్ళనే చూస్తున్నాను !!

"చూశారా మాష్టారూ ! ఈ కండక్టరెలా అబద్ధమాడుతున్నాడో ! నేను ఈనాడు దగ్గరెక్కి, పదిరూపాయల నోటిచ్చాను. ఫిఫ్టీపైస్ టికెట్ కట్‌చేసి, మిగతా చిల్లర తరవాతిస్తానన్నాడు. ఇప్పుడడిగితే నేనసలు పదినోటు ఇవ్వనేలేదని అంటున్నాడు. పైగా మర్యాద లేకుండా 'నువ్వు' అని కూలివాడితో మాట్లాడినట్లు మాట్లాడుతున్నాడు" పక్కనే నిలబడి వున్న ఓ పాసింజరుతో అన్నాడు సూటువాలా.

"ఏమయ్యా కండక్టరూ ! నీకసలు బుద్ధుందా ! పెద్దమనిషిలా కనిపిస్తున్న ఆయనెందుకు అబద్ధమాడతాడు ? నిజానికి నువ్వే కావాలని అబద్ధమాడుతున్నావు. అసలెప్పుడూ మీ కండక్టర్లంతా ఇంతే ; టిక్కెట్లు కట్‌చేసి, చిల్లర తరవాతిస్తామని అంటారు. తీరా అడిగితే మీరివ్వలేదు పొమ్మంటారు. ఆయన తప్పకుండా నీకు పది నోటు ఇచ్చివుంటారు ! మర్యాదగా ఆయన చిల్లర ఆయనకిచ్చేయ్ !" అన్నాడు పాసింజరు. సూటువాలాని సపోర్టుచేస్తూ.

"నేనేమీ అబద్ధాలాడేవాడిని కాదండీ! ఆయన నాకసలు పదినోటివ్వలేదు." రోషంగా అన్నాడు కండక్టరు.

"ఒకవేళ నువ్వు మర్చిపోయావేమో! గుర్తు తెచ్చుకుని ఆయన చిల్లర ఆయనకిచ్చేయ్!" అంటూ మరో పాసింజరు కల్పించుకుని సూటు వాలాకి వకాల్తా పలికాడు.

"లేదు సార్! నేనంత మతిమరుపువాడిని కాను. ఈయన నా చేతిలో టిక్కెట్టుకి కేవలం అర్ధరూపాయి మాత్రమే పెట్టారు. ఒకవేళ చిల్లర లేకపోతే నేనిచ్చే టికెట్టుమీద తప్పని సరిగా డ్యూ రాస్తాను" చెప్పాడు కండక్టరు.

"మీ అందరు కండక్టర్లూ అలా ఎప్పుడూ డ్యూలు రాయడంలేదు ఆర్. టి. సి బస్సులు వచ్చిన కొత్తలో అలా రాసేవాళ్ళు. తరువాత అలా రాయడం మానేశారు. పైగా నోటిమాటతో తరవాతిస్తామని అనేసి, తీరా చిల్లర అడుగు తూంటే ఇవ్వలేదని బొంకేస్తున్నారు" ఇంకో పాసింజరు కల్పించుకుని సూటువాలాకి వత్తాసు పలికాడు.

"మిగతా కండక్టర్ల మాటేమోకాని నేను మాత్రం చిల్లర లేకపోతే టిక్కెట్టుమీద తప్పని సరిగా డ్యూ రాస్తాను" గట్టిగా నొక్కిచెప్పాడు కండక్టరు.

లేదు. నువ్వబద్ధం ఆడుతున్నావ్! నాకు బాగా తెలుసు. నేను రోజూ చూస్తున్నాను. అసలు మీ కండక్టర్లెవరూ అలా చేయడంలేదు" మరో పాసింజరు సూటువాలావి సైడు చేశాడు.

చూస్తూండగానే సూటువాలాకి పాసింజర్ల ప్రోత్సాహం ఎక్కువైపోయింది. మొదట్లో నలుగురు పాసింజర్లతో ప్రారంభమైన సపోర్టు పన్నెండుమందికి పెరిగిపోయింది. బస్సులో రణగొణధ్వని ఎక్కువైపోయింది.

పాసింజర్లకి, కండక్టర్‌కి వాగ్వివాదం పెరిగి పోతోంది.

ఆ ఘర్షణ చూస్తున్న నేను ఆవేశం పట్టలేక పోయాను.

నాలో కోపం కట్టలు తెంచుకు వచ్చింది.

నా సీట్లోంచి దిగ్గున లేచి నిలబడి పాసింజర్లకి ఏదో చెప్పబోయాను.

కాని, వాళ్ళు నన్ను లక్ష్యపెట్టేలా లేరు. వాళ్ళ వాదనలో వాళ్ళున్నారు.

చేసేది లేక నా సీట్లో మళ్ళీ కూలబడ్డాను....

నిస్సహాయంగా అక్కడ జరుగుతోన్న దారుణాన్ని తిలకిస్తున్నాను.... బస్సులో గలాటా అలా జరుగుతూనే వుంది.

కండక్టరు పాసింజర్లతో తన బేగ్‌లోని చిల్లర అంతా లెక్క పెట్టుకోమంటున్నాడు. తను ఎన్ని టిక్కెట్లు అయితే కట్‌చేశాడో.... అంత చిల్లరమాత్రమే తన కేష్‌బేగ్‌లో వుంటుందని, అంతకంటే ఎక్కువ చిల్లర వుంటే ఆ సూటువాలని తీసుకోమని పాసింజర్లని కన్విన్స్ చేస్తూ మాట్లాడుతున్నాడు.

అయినా పాసింజర్లు అతడిమాట వినడం లేదు....

కేష్‌బేగ్‌లోని చిల్లర లెక్కపెట్టే ప్రయత్నం చేయడంలేదు....

పైగా ఆ పది నోటుని కండక్టర్ జేబులో పెట్టేసుకున్నాడని అన్నారు.

సూటువాలాతో సహా అంతా కలిసి కండక్టర్‌ని నానారకాలుగా నిందిస్తున్నారు.

ఆర్. టి. సి స్టాఫ్‌ని దుమ్మెత్తి పోస్తున్నారు.

బండబూతులు తిడుతున్నారు.

మానాభిమానాలున్న ఏ కండక్టరూ ఆ బండ బూతుల్ని భరించలేడు. కత్తితో పొడుచుకుని చావవలసిందే!

ఆ వెధవ బూతులు వినలేక కండక్టరు చెవులు మూసుకున్నాడు.

మారు మాట్లాడకుండా తన పేంటు జేబులోంచి కొన్ని నోట్లు, కొంత చిల్లర బయటికి తీసి-సూటువాలాకి తొమ్మిదిరూపాయల యాభై పైసలు లెఖ్ఖపెట్టి ఇచ్చేశాడు.

సూటువాలా ముఖం ఆనందంతో కళ కళలాడింది.

బస్సుదిగి వెళ్ళిపోయాడు.

పాసింజర్ల చెత్తబూతులు ఆగిపోయాయి.

నేను చూస్తూండగానే నా కళ్ళముందు దోపిడీ జరిగిపోయింది.

సత్యం వధించబడింది....
ధర్మం చెరబట్టబడింది....

నా కళ్ళనుండి అప్రయత్నంగా రెండు కన్నీటి బిందువులు కిందికి రాలాయి.

ఆ సూటువాలా ఎవరో నాకు బాగా తెలుసు:

వాడు నన్ను ఎన్నిరోజులనుంచి గమనిస్తున్నాడో ఏమో!.... నాలుగు రోజులక్రితం రామకృష్ణా బీచ్‌లో రాత్రి ఎనిమిది గంటలకు నేను నడుచుకుంటూ వస్తూంటే, ఒంటరిగావున్న నన్ను చూసి-నా మెడలో బంగారు గొలుసు లాక్కుపోయాడు. అప్పుడూ వాడినేమీ చేయలేకపోయాను. వాడు కండక్టర్‌కి అర్ధరూపాయి మాత్రమే ఇచ్చి టిక్కెట్టు తీసుకోవడం చూసి కూడ ఇప్పుడూ ఏమీ చేయలేకపోయాను. చెప్పాలని ప్రయత్నం చేసినా పాసింజర్లు నన్నర్థం చేసుకోలేకపోయారు. నేను కళ్ళారా చూసిన ఈ నిజం నా మనసులోనే శవంలా నిర్నిద్రగా సమాధి అయి.... దాని రక్తమాంసాలు కుళ్ళి.... నా అంతంతోపాటే ఎముకలై భూమిలో కలిసిపోవలసిందే! సదా నిర్నిద్రాగానాన్ని ఆలాపించవలసిందే!

## కారణం......
## నేనో మూగవాడిని!?!


— సారె
రామమోహనరావు
టెలిఫోన్ ఆపరేటర్
నార్త్‌ఎక్స్‌టెన్షన్
టి. పి. టి. కాలని
సీతమ్మధర విశాఖపట్నం-530013


